
గవర కంచరపాలెం మలుపు వద్ద పొదలు


మర్రిపాలెం రైల్వేస్టేషన్‌కు వెళ్లే మలుపు రహదారి ఇలా..


ఊర్వశి కూడలి నుంచి డీజిల్ లోకోషెడ్‌కు వెళ్లే ప్రమాదకర మలుపు ఇలా..

# మలుపులతో భయాందోళన


రామ్మూర్తిపంతులుపేట రైల్వే గేటు రహదారిలో చీకట్లోనే రాకపోకలు

అధ్వానంగా రైల్వే ప్రాంతాల రహదారులు

రోడ్లపైకి విస్తరించిన ముళ్లపొదలు

అదనపు ట్రాక్ నిర్మాణ పనులతో రహదారులు ఛిద్రం

కంచరపాలెం : రహదారుల్లోని మలుపులు... ఆ మలుపుల వద్ద రోడ్లపైకి విస్తరించిన ముళ్ల పొదలు వాహనదారులు, పాదచారులను హడలెత్తిస్తున్నాయి. జీవీఎంసీ 56, 57 వార్డులు కంచరపాలెం పరిధి పైడిమాంబ కాలనీ రైల్వే లెవెల్ క్రాసింగ్ నుంచి రామ్మూర్తి పంతులుపేట, గవర కంచరపాలెం మీదుగా రైల్వే లోకో షెడ్ రహదారి డీజిల్ షెడ్ వద్ద, ఊర్వశి కూడలి రైల్వే వంతెన, 104 ఏరియా, ఆశవానిపాలెం, శ్యామ్‌నగర్, మర్రిపాలెం రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారుల్లోని మలుపులతో ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రామ్మూర్తిపంతులపేట, సుభాష్‌నగర్, గోకుల్‌నగర్ పైడిమాంబ కాలనీ, దయానందనగర్, ఆశోక్‌పార్కు, ఆశవానిపాలెం, 104 ఏరియా, శ్యామ్‌నగర్, మర్రిపాలెం రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాలకు, డాక్‌యార్డు, రైల్వే, ఎంతఃఎస్ ఉద్యోగులు రాకపోకలకు ఈ మార్గాన్నే వినియోగిస్తుంటారు. రహదారిలో విద్యుత్ దీపాలు లేకపోవడంతో చీకటి పడితే ద్విచక్ర వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. విశాఖ రైల్వేస్టేషన్ రహదారి నుంచి ఎన్ఏడీ జంక్షన్ వరకు వెళ్లే కొత్త రైల్వేలైన్ పనులు జరుగుతుండడంతో భారీ వాహనాల రాకపోకలతో రహదారి మలుపులో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రైల్వేకు చెందిన రహదారులు కావడంతో జీవీఎంసీ అధికారులు విద్యుత్ లైట్ల ఏర్పాటుపై దృష్టి పెట్టడం లేదని పలువురు వాపోతున్నారు.

**రోడ్లపైకి తుమ్మచెట్ల పొదలతో ఇబ్బందులు**

కంచరపాలెం నుంచి మర్రిపాలెం రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డులో ఇరువైపులా పొదలతో కూడిన చెట్లు ఏపుగా పెరగడంతో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఏపుగా పెరిగిన తుమ్మచెట్లు పొదల మధ్య స్థానిక బిల్డర్లు, ఇంటి యజమానులు నిర్మాణ వ్యర్థాలు (డెబ్రిస్)లు రోడ్డుకు ఇరువైపులా వేసేస్తున్నారు. రాత్రి సమయాల్లో ఆకతాయిలు, మందుబాబులతో రహదారులు నిండిపోతున్నాయి. ఆటుగా వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసాంఘిక కార్యక్రమాలకు రహదారులు నిలయంగా మారుతున్నాయని వాపోతున్నారు. గతంలో రైల్వే బోగీలను వాటర్‌తో శుభ్రం చేసేందుకు ఏర్పాటు చేసిన భారీ వాటర్ ట్యాంకులు, శుభ్రం చేసే యంత్రాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. వీటికోసం ప్రధాన రహదారిని వినియోగించారు. ఇప్పుడు వాటిని వినియోగించకపోవడంతో మూలకు చేరాయి. మలుపు రహదారిలో నిరుపయోగంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రహదారిలో చీకటిగా ఉండడంతో ఇటీవల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పొదలను తొలగించాలని, విద్యుత్ దీపాల వెలుగులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.


వాషింగ్‌లైన్ మలుపులో రాకపోకలు సాగిస్తున్న పాదచారులు, వాహనదారులు

**ప్రయాణం భయంగా ఉంది**

రైల్వే ప్రాంతాల రహదారిలో ప్రయాణం సాగించాలంటే నిత్యం భయాందోళన చెందాల్సి వస్తోంది. ద్విచక్ర వాహనంపైనే వెళ్తుంటే భయంగా ఉంటుంది. పాదచారుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. విద్యుత్ స్తంభాలకు లైట్లు లేకపోవడం, పొదలు, చెట్లు రోడ్డుపైకి రావడంతో విష కీటకాలతో ఆందోళన చెందుతున్నాం.

– పల్లా శివకుమార్, రైల్వే ఉద్యోగి, మర్రిపాలెం

**అధికారులు స్పందించాలి**

రామ్మూర్తిపంతులపేట రైల్వే గేటు నుంచి మర్రిపాలెం రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో మలుపుల్లో పెరిగిన పొదలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అటుగా రాకపోకలు సాగించాలంటే ఆందోళనగా ఉంది. విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి, మలుపుల వద్ద పొదలు తొలగించేలా అధికారులు స్పందించాలి.

– పి.ఉమామహేశ్వరి, రాజీవ్‌కాలనీ, కంచరపాలెం.

## మందకొడిగా దీపావళి సామగ్రి విక్రయాలు

గోపాలపట్నం, ఎన్ఏడీ కూడలిలో వ్యాపారులకు ఆలస్యంగా అనుమతులు


ఎన్ఏడీ కూడలిలో ఏర్పాటు చేసిన స్టాళ్లు

గోపాలపట్నం : గోపాలపట్నం, ఎన్ఏడీ ప్రాంతాల్లో దీపావళి సామగ్రి విక్రయాలు మందకొడిగా సాగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో స్టాళ్ల ఏర్పాటుకు అనుమతులు ఆలస్యంగా రావడంతో వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. ఎన్ఏడీ జంక్షన్‌లో స్టాళ్ల ఏర్పాటుకు అనుమతులు ఆదివారం మధ్యాహ్నం వరకు రాకపోవడంతో అప్పటి వరకు సామగ్రి అంతా తీసుకొచ్చిన వారు ఆందోళన చెందారు. ఏం చేయాలో అర్థం కాని స్థితిలో ఉండిపోయామని వ్యాపారులు వాపోయారు. అయితే సాయంత్రానికి అనుమతులు రావడంతో వ్యాపారులంతా ఊపిరి పీల్చుకున్నారు. గోపాలపట్నంలో 36, ఎన్ఏడీ జంక్షన్‌లో 14 దుకాణాలకు అధికారులు అనుమతులిచ్చారు.

**ఆందోళన కలిగించిన వర్షం**

అనుమతులు ఆలస్యంగా రావడానికి తోడు ఆదివారం ఉదయం నుంచి వర్షం కురవడంతో వ్యాపారులు మరింత ఆందోళన చెందారు. సాయంత్రానికి వర్షం తెరిపివ్వడంతో నగరవాసులు స్టాళ్లలో కొనుగోళ్లు ప్రారంభించారు. సోమవారం ఉదయం కొనుగోళ్లు ఊపందుకుంటాయని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జీఎస్టీ తగ్గడంతో ధరలు తగ్గాయని వ్యాపారులు చెబుతున్నారు. దీని వల్ల కొనుగోళ్లు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## 22న గోవర్ధన పూజ

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద హరే కృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దామోదర దీపోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 22 సాయంత్రం 6 గంటలకు గోవర్ధన పూజ నిర్వహించనున్నట్టు యదురాజ దాస తెలిపారు. ఆదివారం ఆయన భక్తులతో మాట్లాడుతూ గోవర్ధన పూజ సందర్భంగా పిండి వంటలతో గోవర్ధన గిరి నమూనా తయారు చేయనున్నట్టు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శ్రీకృష్ణ భగవానుని కృప పొందాలని కోరారు. అలాగే దామోదర మాసం 13వ రోజు సందర్భంగా ఆదివారం భక్తులు నెయ్యి దీపాలను శ్రీకృష్ణునికి ఇష్టమైన దామోదర అష్టకం పాడుతూ హారతిగా అందించారు.

## క్లుప్తంగా

### శేషుకు అభినందనలు


శేషును సత్కరిస్తున్న లక్కరాజు రామకృష్ణ, తదితరులు

మల్కాపురం : జీవీఎంసీ 59వ వార్డు గణపతినగర్ ప్రాంతానికి చెందిన దుడ్లు శేషు ఇటీవల 40వ నేషనల్ 200 మీటర్స్ రన్నింగ్ పోటీలో పాల్గొని మూడో స్థానంలో నిలవడంతో పలువు రు అభినందనలు తెలిపారు. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన యువకుడు జాతీయ స్థాయి రన్నింగ్ పోటీల్లో ప్రతిభ చూపడంతో క్రీడాకారులతో పాటు ములగాడ మండల బీజేపీ అధ్యక్షుడు లక్కరాజు రామకృష్ణ అభినందించారు. ఈ సందర్భంగా గణపతినగర్ వద్ద ఆదివారం శేషును సత్కరించి, జ్ఞాపిక అందించారు. అంతర్జాతీయ స్థాయిలోనూ శేషు రాణించాలని పలువురు ఆకాంక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి క్రీడాకారులకు అండగా నిలిచి ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో గణపతినగర్ ప్రాంత వాసులు పాల్గొన్నారు.

### ప్రకాష్‌నగర్‌లో వైద్య శిబిరం


వైద్య శిబిరంలో గౌరీ సేవా సంఘం ప్రతినిధులు

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ప్రకాష్‌నగర్ ఏడు గుడుల సెంటర్ వద్ద ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. స్థానిక గౌరీ సేవా సంఘం, అపోలో ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో సుమారు 200 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. గౌరీ సేవా సంఘం ప్రతినిధులు వెంకటప్పారావు, సూరప్పారావు, గంగాధర్, రమేష్, శేషు తదితరులు పాల్గొన్నారు.

### యువకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్


తీరంలో కాపాడిన యువకులతో లైఫ్‌గార్డులు, మెరైన్ పోలీసులు

ఏయూ క్యాంపస్: సాగర తీరంలో సముద్ర స్నానం చేయడానికి వచ్చి మునిగిపోతున్న ఇద్దరు యువకులను లైఫ్‌గార్డ్‌లు, మెరైన్ పోలీసులు రక్షించారు. హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు యువకులు విశాఖ పర్యటనకు వచ్చారు. ఆదివారం సాయంత్రం ఆర్‌కే బీచ్ వద్ద స్నానం చేస్తుండగా వారిలో ఇంజమాముల్ హక్, నయీమ్‌లు కెరటాల ధాటికి సముద్రంలోకి వెళ్లిపోయారు వెంటనే అక్కడే విధుల్లో ఉన్న మెరైన్ పోలీసులు స్పందించి జీవీఎంసీ లైఫ్ గార్డులను అప్రమత్తం చేశారు. వెంటనే వారు మునిగిపోతున్న ఇద్దరు యువకులను రక్షించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి అక్కడి నుంచి పంపించేశారు.

### ఏయూలో ప్రకృతి పంటల సంత విజయవంతం


ప్రకృతి పంటల సంతలో భారత్ కిసాన్ సంఘ్ కేంద్ర కమిటీ సభ్యుడు జలగం కుమారస్వామి, తదితరులు

మద్దిలపాలెం: ఏయూలోని 'ఆ హబ్' ప్రాంగణంలో భారత్ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రకృతి ఆధారిత పంటల సంత విజయవంతమైంది. ఈ సందర్భంగా భారత్ కిసాన్ సంఘ్ కేంద్ర కమిటీ సభ్యుడు జలగం కుమారస్వామి మాట్లాడుతూ ఈ సంతకు విశేష స్పందన లభించిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనం కోసం ప్రకృతి ఆధారిత పంటలనే ఆహారంగా తీసుకోవాలని కోరారు. ఈ ప్రకృతి ఆధారిత పంటల సంత ఇకపై ప్రతి ఆదివారం ఇదే వేదికపై క్రమం తప్పకుండా జరుగుతుందని వెల్లడించారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వారాహి ఎఫ్‌పీవో సహకారంతో ఈ పంటలను నేరుగా వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ హబ్ సంస్థ ప్రతినిధి ఈశ్వరపు రవి, గో ఆధారిత ప్రకృతి పంటల రైతు సంఘం ప్రతినిధులు పి.ఎల్.ఎన్. రాజు, దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, పాలెం నేచురల్స్ అశోక్, రిషి, వారాహి సంస్థ ప్రతినిధి గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గురుస్వామి వసంతరావు ఇకలేరు


గురుస్వామి వసంతరావు (ఫైల్)

డాబాగార్డెన్స్: తూర్పు కోస్తా రైల్వేలో పీపీటు డీఆర్ఎంగా పదవీ విరమణ చేసిన అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం విశాఖ శాఖ కార్యదర్శి వసంతరావు (79) మధుమేహ వ్యాధితో నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. డీబీకే రైల్వే క్వార్టర్స్‌లో లక్ష్మీ వర సిద్ధి వినాయక భవానీ శంకర ఆయాన్ని స్థాపించి, ఆలయ అధ్యక్షుడిగా చక్కటి సేవలందించారు. కేరళ శబరిమలై భక్తుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అఖిల భారత అయ్యప్ప సేవా సంఘానికి సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యునిగా రాష్ట్రం తరఫున సేవలందించారు. 82 సార్లు శబరిమలై అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. 41 సార్లు మకరజ్యోతి దర్శనం కూడా చేశారు. వసంతరావు అకాల మృతికి అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం విశాఖ శాఖ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు కాన్వెంట్ జంక్షన్ సమీపాన ఉన్న హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు వసంతరావు భార్య లక్ష్మి, కుటుంబ సభ్యులు తెలిపారు.

## మత్స్యకారుల మోముల్లో వెలుగు

సాగరంలో చేపల వేట మత్స్యకారులకు ఎప్పుడూ ఒక పోరాటమే. కానీ.. ఆదివారం విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో కనిపించిన దృశ్యం ఆ కష్టానికి తగిన ఫలితాన్ని కళ్లకు కట్టింది. నిత్యం సాగరంలో వేట చేసే మత్స్యకారులకు ఆదివారం పంట పండింది. వారి బోట్లు నిండుగా మత్స్య సంపదతో ఒడ్డుకు చేరాయి. దీంతో వారి మోముల్లో సంతోషం వెల్లివిరిసింది.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం









## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో తీవ్ర నష్టం

మల్కాపురం : పేదలకు వైద్యం, పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులో ఉంచాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి మెడికల్ కళాశాలలు తీసుకొస్తే... వాటిని కూటమి సర్కార్ ప్రైవేటీకరిస్తుండడం దారుణమని వైఎస్సార్ సీపీ 61వ వార్డు అధ్యక్షుడు పిలక రామ్మోహన్‌రెడ్డి (పిలక రాము) ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్టీ అధిష్టానం చేపట్టిన కోటి సంతకాల సేకరణను ఆదివారం మల్కాపురం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరిస్తే పేద విద్యార్థులకు వైద్య విద్య అందనంత దూరమవుతుందన్నారు. ఫీజుల భారం భరించలేరన్నారు. ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందుబాటులో లేకుండా పోతుందన్నారు. లక్షల కోట్ల రూపాయల విలువ చేసే ప్రజల ఆస్తిని ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టే అధికారం కూటమి సర్కార్‌కు ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చట్టి నూకరాజుయాదవ్, శంకర్ రెడ్డి, బూస అప్పలరెడ్డి, అనంత్, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పిలక రాము, తదితరులు

జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీ వద్ద ఆదివారం సాయంత్రం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ, ఖాన్, అర్జున్, ఎం.పెంటారావు తదితరులు సంతకాలు సేకరించారు.

**కొత్తపాలెంలో సంతకాల సేకరణ**

గోపాలపట్నం : జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి దొడ్డి కిరణ్ ఆధ్వర్యంలో సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్య, వైద్య రంగాలను నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ చర్యలను తిప్పి కొట్టేందుకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో షేక్ రెహమాన్, యురి తులసి తదితరులు పాల్గొన్నారు.


కొత్తపాలెంలో సంతకాలు సేకరిస్తున్న దొడ్డి కిరణ్, తదితరులు

## అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో అర్చన చేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన సేవ విశేషంగా నిర్వహించారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తరపూజ జరిపారు.

**ఘనంగా నిత్యకల్యాణం :** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు.

## కొనసాగిన ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్ల నిరసన


వాల్తేర్ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న అద్దె బస్సుల డ్రైవర్లు, సిబ్బంది

ఎంవీపీ కాలనీ: నెల వారీ జీతాలు రూ.26 వేలకు పెంచడంతోపాటు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు, సిబ్బంది విధులు బహిష్కరించి చేపట్టిన నిరసన కార్యక్రమం రెండో రోజూ కొనసాగింది. వాల్తేర్ డిపో ఆవరణలో ఆదివారం సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో ఆర్టీసీ హైయర్ బస్సుల డ్రైవర్ల సంఘం నాయకులు పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వెంకటరావు మాట్లాడుతూ రోజువారీగా డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై డిపో యాజమాన్యం పట్టనట్లు వ్యవహరిస్తోందన్నారు. గత కొన్నేళ్లుగా ఉద్యోగుల జీతాలు పెంచకుండా, సౌకర్యాలు కల్పించకుండా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.18 వేల జీతంతో కూడిన అగ్రిమెంట్ పూర్తయి ఏడాది గడిచినా జీతాలు పెంచలేదన్నారు. తక్షణమే రూ.26 వేలు నెల వారి జీతంగా ప్రకటించడంతోపాటు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంఘం కార్యదర్శి జంపన్న మాట్లాడుతూ వాల్తేర్ డిపో పరిధిలో 80 మంది డ్రైవర్లు ఉండగా 29 అద్దె బస్సు సర్వీసులు నడుస్తున్నాయన్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించకుంటే నిరసనను మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రఘు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో స్థానిక ప్రతిభకు పట్టం

నలుగురు కళాకారిణులకు 'నాట్యమయూరి'అవార్డులు



నృత్య ప్రదర్శన చేస్తున్న సంగివలసకు చెందిన రజనీరెడ్డి


నాట్యమయూరి అవార్డులు అందుకుంటున్న నాట్యరవళి అకాడమీ విద్యార్థులు



నృత్య ప్రదర్శన చేస్తున్న తగరపువలసకు చెందిన లిఖితసాయి

తగరపువలస: హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియం.. స్థానిక నృత్య కళాకారిణుల ప్రతిభకు వేదికైంది. నృత్యమాల నాట్యకళ వెల్ఫేర్ సొసైటీ, సిరి ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహించిన నృత్య ప్రదర్శనల్లో తగరపువలస, సంగివలస ప్రాంతాలకు చెందిన నలుగురు కళాకారిణులు ప్రతిష్టాత్మక నాట్యమయూరి పురస్కారాలను కైవసం చేసుకున్నారు. తగరపువలసలోని నాట్యరవళి మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీకి చెందిన లిఖిత సాయి, లక్ష్మీలహరి, గీతామాధురి తమ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వీరు కూచిపూడిలో జావళి, తరంగం, శబ్దం, అన్నమయ్య కీర్తనలతో పాటు కోయిరాలే, కోడిపందెం, కైకలూరి చిన్నదాన్ని వంటి జానపద నృత్య అంశాలను అద్భుతంగా ప్రదర్శించి ఉత్తమ ప్రదర్శనకుగానూ అవార్డులు గెలుచుకున్నారు. గతంలో వీరు తిరుపతి, రాజమహేంద్రవరం వంటి జాతీయస్థాయి వేదికలపైనా సత్తా చాటడం గమనార్హం. అదే విధంగా జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలోని సంగివలసకు చెందిన శ్రీ నృత్యప్రియ అకాడమీ నిర్వాహకురాలు చేట్ల రజనీరెడ్డి సైతం ఇదే వేదికపై నాట్యమయూరి అవార్డును అందుకున్నారు. ఆమె ప్రదర్శించిన అదివో అల్లదివో కూచిపూడి శాస్త్రీయ నృత్యం నిర్వాహకుల ప్రశంసలు పొందింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి విజేతలకు అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులను జాతీయ స్థాయిలో తీర్చిదిద్దిన నాట్యరవళి అకాడమీ డైరెక్టర్ ఉమ్మిడి మహేష్‌బాబును నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.